మజ్జిగ పంపిణీ అభినందనీయం


మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ సమీపంలోని సాయినగర్‌లో ఇగ్నైట్ విద్యా సంస్థ ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విద్యా సంస్థల చైర్మన్ రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో సాయినగర్‌వాసులు వైఎస్.ప్రసాద్, అచ్యుత రామయ్య, దుర్గాప్రసాద్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, తులసి, విష్ణు, ప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థి ఆత్మహత్యా యత్నం

మియాపూర్: పాఠశాల భవనం ఐదవ అంతస్తు పైనుంచి దూకి ఒక విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై ఎస్‌ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోకుల్ ప్లాట్స్ కాలనీలోని క్వాంటమ్ లీఫ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న హరీష్ చంద్రప్రసాద్ సోమవారం సాయంత్రం పాఠశాల విడిచిన తర్వాత ఐదవ అంతస్తు పైకి ఎక్కి కిందకు దూకగా..గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న రేకులపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఉపాధ్యాయులు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి..సమీపంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: అభివృద్ధి పనులను నిర్దీత కాల వ్యవధిలో పూర్తిచేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని శ్రీలా గార్డెన్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, నాయకులు సంతోష్,,నరేష్ నాయక్, కాలనీవాసులు పణీ కుమార్,చేతన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య


కోటపల్లి కిషన్‌రాజు(ఫైల్)

గచ్చిబౌలి: ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన కోటపల్లి కిషన్‌రాజు(63) భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో జనవరి 23న పెద్ద కూతురు వద్దకు వెళ్లి నేను వెళ్లిపోతున్నాను, నా కోసం వెతకొద్దు అని చెప్పి సెల్‌ఫోన్, స్కూటి అప్పగించి వెళ్లాడు. రాయదుర్గంలోని మహాప్రస్థానం ఎదురుగా ఉన్న గుట్ట వద్ద వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 40 రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు తెలిపారు. సోమవారం ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

గచ్చిబౌలి: వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆటోడ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాములు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొడియార్ మండలం, వాల్యానాయక్ తండాకు చెందిన కాట్రవత్ భీమ(32) ఆటోడ్రైవర్. ఫిబ్రవరి 1న తెల్లవారుజామున 3 గంటల సమయంలో ప్రయాణికులతో వెళుతుండగా గచ్చిబౌలిలోని బాంబూస్ విల్లాస్ సమీపంలో వెనక నుంచి వచ్చిన హుండాయ్ కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలో స్పీడ్

- త్వరితగతిన టార్గెట్ పూర్తి చేసేందుకు చర్యలు ముమ్మరం
- లక్ష్యం రూ.390 కోట్లు.. వసూలు రూ.246 కోట్లు


శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం

శేరిలింగంపల్లి: 'ప్రాపర్టీట్యాక్స్' వసూలులో ఏటా జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ముందుండే ప్రాంతాల్లో శేరిలింగంపల్లి సర్కిల్ ఒకటి. దీనిని మళ్లీ నిలబెట్టుకునేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల కోసం సర్కిల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నెల రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఎప్పటికప్పుడు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లపై దృష్టిపెట్టారు.

లక్ష్యం భారీ..అయినా పట్టుదలతో ముందుకు..

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు టార్గెట్ భారీగానే ఉంటుంది.

- ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు లక్ష్యం రూ.390.32 కోట్లుగా నిర్దేశించారు.
- ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి సర్కిల్‌లో రూ.246.26 కోట్లు ప్రాపర్టీట్యాక్స్ వసూలు కావడం విశేషం. అదే ఊపుతో లక్ష్య సాధన కోసం అధికార యంత్రాంగం పనిచేస్తోంది.
- గత ఏడాది మార్చి 31 వరకు రూ.256.43 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు కాగా ఇప్పటికే రూ.246.26 కోట్లు వసూలు చేశారు.
- నోడల్ ఆఫీసర్‌ను నియమించి ప్రాపర్టీట్యాక్స్ వసూలుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డాకెట్ వారీగా అత్యధిక బకాయిలు ఉన్న వారిని గుర్తించి నోటీసులు ఇవ్వడంతో పాటు ట్యాక్స్ వసూలుకు ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- ఆయా ప్రాంతాల బిల్ కలెక్టర్‌లతో పాటు ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాలు, సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో కూడా చెల్లించొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి ...



సర్కిల్ పరిధిలోని ప్రతి భవన యజమాని ప్రాపర్టీ ట్యాక్స్‌ను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నాం. పన్నులు చెల్లించి జీహెచ్‌ఎంసీకి సహకరించాలి.

– పి.ముకుంద్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, శేరిలింగంపల్లి సర్కిల్

ప్రజావాణి.. 15 వినతులు


శేరిలింగంపల్లి సర్కిల్‌లో.. డిప్యూటి కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఇతర అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 12 ఫిర్యాదులు అందజేశారు. ఇంజనీరింగ్ 2, టౌన్‌ప్లానింగ్ 4, ఎంటమాలజీ, అర్బన్ బయోడైవర్సిటీ, శానిటేషన్, స్ట్రీట్ లైట్స్, రెవెన్యూ, వెటర్నరీ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు చొప్పున వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, ఏఎంసీలు శ్రవణ్ కుమార్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్‌లో..

చందానగర్ : చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 3 వినతిపత్రాలు అందాయని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 3 రాగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో రాణించిన మనూ విద్యార్థులు



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్- రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(సీఎస్‌ఈ-ఆర్‌సీఏ)కి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ క్విజ్‌లో రాణించారు. ప్రతిష్టాత్మకమైన నేషనల్ సైన్స్ క్విజ్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 45 కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వారితో ఈ విద్యార్థులు పోటీ పడ్డారు. అందులో 'మనూ' బృందంలో డాక్టర్ మిన్హాజ్ అహ్మద్, ఎండీనజీర్, ఎస్‌డీ సోహెల్ పాల్గొని జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. ఇటీవల సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో సైన్స్ ఆధారిత క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ మొగులమ్మ బస్తీకాలనీవాసులు సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే మొగులమ్మ బస్తీకాలనీలో పర్యటిస్తానన్నారు. కాలనీలో రోడ్లు, యూజీడీ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా డ్రైనేజీ, తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మొగులమ్మ బస్తీ నాయకులు జాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

'మనూ'లో 16న ప్రత్యేక జాబ్ మేళా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ హైదరాబాద్‌లో చివరి సంవత్సరం చదివే విద్యార్థులు, ఉత్తీర్ణులైన విద్యార్థులకోసం ప్రత్యేక జాబ్ మేళా/ఫెయిర్‌ను ఏర్పాటు చేసినట్లు 'మనూ' శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ సోమవారం తెలిపారు. ఫ్యాకల్టీ అవసరాలు, ఖాళీలు ఉన్న ఆసక్తి గల కళాశాలలు/పాఠశాలలు/సంస్థలు రిజిస్ట్రేషన్ ఫీజు రూ 10వేలు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని ఆయన వివరించారు. మరిన్ని వివరాల కోసం డాక్టర్ యూసుఫ్‌ఖాన్(9848171044) అసిస్టెంట్ ప్రొఫెసర్ గుప్రాన్ బర్కతి(9044145228) కార్పొరేట్ కన్సల్టెంట్ సమీర్‌పాషా (9700064077)లో సంప్రదించాలని ఆయన కోరారు.

చందానగర్ సర్కిల్‌కు ఐదుగురు జూనియర్ అసిస్టెంట్‌లు

చందానగర్ : చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంకు నూతనంగా ఐదుగురు జూనియర్ అసిస్టెంట్‌లు సోమవారం విధుల్లో చేరారు. దుండిగళ్ళ సాయితేజ హెల్త్ అండ్ శానిటేషన్, గూడెపు సాయితేజను రెవెన్యూ, రెబ్బ సాయి కిరణ్‌ను టౌన్‌ప్లానింగ్, కటరోత్ సురేష్‌ని యూసీడీ, జంగం వీణను ఎలక్షన్ సెక్షన్లకు కేటాయించారు.

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీలో హెచ్‌సీయూ విద్యార్థులు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా శ్రీరామ్‌యాదవ్, రచనారెడ్డి




రాయదుర్గం: భారత జాతీయ కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్‌ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఇద్దరు హెచ్‌సీయూ పీహెచ్‌డీ విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యాడవల్లి వెంకటస్వామి, రాష్ట్ర ఇన్‌చార్జి ప్రతీక్‌సింగ్‌లు నియామకపత్రాలను అందజేశారు. హెచ్‌సీయూలో పీహెచ్‌డీ చేస్తున్న పట్లోళ్ళ శ్రీరామ్‌యాదవ్, రచనారెడ్డి ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, సభ్యులు, పలువురు విద్యార్థులు వీరిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌యాదవ్, రచనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడతామన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పటాన్‌చెరు టౌన్: పాఠశాల స్థాయి నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు.సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర ఆదేశాల మేరకు పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.... విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని.. న్యాయ సహాయం కోసం సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఎస్‌ఐ కుర్షిత్, ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మయూరినగర్ సబ్‌స్టేషన్ పరిశీలన


మయూరినగర్‌లో సబ్‌స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

మియాపూర్: మియాపూర్ మయూరినగర్ కాలనీలో సబ్‌స్టేషన్‌లో నూతనంగా చేపట్టిన విద్యుత్ సంబంధిత పనులను ఆశాఖ అధికారులు ఎస్‌ఈ రవికుమార్, డీఈ జనప్రియ, ఏడీఈ హరికృష్ణలు సోమవారం పరిశీలించారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లోడింగ్ సమస్యలు అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

చందానగర్ : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమంను సోమవారం శేరిలింగంపల్లిలో నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు యూనియన్ సభ్యత్వం చేపట్టామన్నారు. త్వరలో నిర్వహించనున్న మహాసభలలో జిల్లాలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సలీమ్ పాషా, శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్, మాధవరెడ్డి, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు ప్రణయ్, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యాసిన్, కోశాధికారి వరుణ్, కార్యదర్శి నరేష్, నాగరత్నం, ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల పాత్ర కీలకం

రాయదుర్గం: మెరుగైన ప్రపంచాన్ని రూపొందించడంలో స్టార్టప్‌ల పాత్ర ఉందని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక డైరెక్టర్ జేఏ చౌదరి పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని కపిల్ కావూరి హబ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ తాత్కాలిక కార్యాలయంలో ఇండో పసిఫిక్ క్వాడ్ నారా జపాన్ హబ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతపై ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ఉందన్నారు. నారా జపాన్ హబ్ వ్యవస్థాపకుడు బి రామభద్ర మాట్లాడుతూ భారత-జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాయబారి చంద్రశేఖర్, ప్రొఫెసర్ హిరోమిహిరోస్, ప్రొఫెసర్ ఇజుయామా మేరీ, సంజయ్‌పులిపాక , విశ్రాంత అధికారి కెప్టెన్ టిహెచ్ ఆనందరావు, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితో అసభ్య ప్రవర్తన

- మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన భర్త
- ఒకరు అరెస్ట్, మరో ఇద్దరి కోసం గాలింపు

గచ్చిబౌలి: రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఈవ్‌టీజింగ్‌కు గురైంది. మనస్తాపం చెందిన ఆమె తన భర్తకు విషయాన్ని వివరించగా అతను మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రాయదుర్గంలోని నాలెడ్జి సిటీలో ఐదు రోజుల క్రితం ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తెల్లవారు జామున 3 గంటలకు విధులు ముగించుకొని కంపెనీ నుంచి బయటకు వచ్చింది. క్యాబ్ కోసం వేచి ఉండగా థార్ కారులో అటుగా వచ్చిన యువకులు అసభ్యంగా ప్రవర్తించారు. కారు నంబర్ నోట్ చేసుకున్న మహిళ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని భర్తకు చెప్పింది. దీంతో భర్త కారు నెంబర్ పేర్కొంటూ పోలీసులకు మెయిల్ చేశారు. కారు నంబర్ ఆధారంగా కింగ్ కోఠికి చెందిన అలీ(22)ను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


గుగులోత్ గోవింద్(ఫైల్)

గచ్చిబౌలి: బైక్ ఢీకొనడంతో బుల్లెట్‌పై వెళుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, కొర్వి మండలం, పెద్దగూడ తండాకు చెందిన గుగులోత్ గోవింద్(29) నానక్‌రాంగూడలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ టెలికాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి అతను రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై టెలికాంనగర్ నుంచి మాదాపూర్ వెళుతున్నాడు. శిల్పాలేఅవుట్ ఫ్లైఓవర్ కింద ముందు వెళుతున్న ప్యాషన్ బైక్ ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో వెనక నుంచి వచ్చిన రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను ఢీ కొట్టింది.ఈ ఘటనలో గోవింద్ ఎగిరి సిమెంట్ దిమ్మెపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని గచ్చిబౌలిలోని హిమగిరి హస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. ప్యాషన్ బైక్‌పై వెళుతున్న వినోద్‌కు కాలుకు తీవ్ర గాయమైంది. వెనకాల కూర్చున్న అతడి భార్య జ్యోతికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్ : చందానగర్ సెక్షన్ పరిధి హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు ప్రకాష్ నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో ..

హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో...
హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో..

- సాయిరాంనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 వరకు కుమ్మరి బస్తీ, ఓల్డ్ హఫిజ్‌పేట్ కొంతభాగం, జనప్రియ నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ డి బ్లాక్, ఎన్‌కో అపార్ట్‌మెంట్స్, డబుల బెడ్ రూమ్స్, అపర్ణ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, వార్డ్ ఆఫీస్, రైల్వే స్టేషన్, గ్రీన్ బావర్చి ఏరియాలలో..
- కల్యాణ గార్డెన్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాధవనగర్, రాజారాం కాలనీ ఏరియాలలో..
- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 1.00 వరకు ఆదిత్యనగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్ : వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో ..
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెడ్డికాలనీ, భవానీపురం, శంకర్‌నగర్, పద్మజ కాలనీ, రాజేందర్ రెడ్డి నగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, అంబికా సూపర్‌మార్కెట్, పెద్దమ్మ టెంపుల్, బీఎస్‌రెడ్డి చౌరస్తా, వెంకటేశ్వర్ స్వామి టెంపుల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ,ఫైర్ స్టేషన్, 60 యార్డ్స్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

చందానగర్ : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ నంబర్ ప్లాట్‌ఫారం పార్కింగ్ ఏరియా సమీపంలో సోమవారం గుర్తు తెలియని వృద్ధుడు (60) పడి ఉండడాన్ని గమనించిన ప్రజలు చందానగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

హెచ్‌సీయూ ఎస్పైర్ బయోనెస్ట్ స్టార్టప్‌కు కేంద్రం చేయూత

వీజెన్ ల్యాబ్స్ స్టార్టప్‌కు రూ.3.76 కోట్ల ఆర్థికసాయం

రాయదుర్గం: హెచ్‌సీయూలోని ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్‌లోని స్టార్టప్ వీజెన్ ల్యాబ్స్‌కు కేంద్రం ఆర్థిక సహాయం అందించింది. ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణకు అవసరమైన మందుల తయారు చేయడంపై పరిశోధనలు చేసిన ఈ వీజెన్ ల్యాబ్స్‌కు కేంద్రంలోని శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్‌ఏసీ) ద్వారా రూ.3.76 కోట్ల నిధులను మంజూరు చేశారు. భారతదేశంలో క్యాన్సర్ సంబంధిత మరణాలలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కూడా ప్రధాన కారణాలలో ఒకటిగా ఉంది, ప్రతియేటా దేశంలో 70వేల మందికి కొత్తగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురవుతున్నట్లు నివేదికల్లో స్పష్టం అవుతోంది.


ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్ స్టార్టప్ నిర్వాహకులు

బయోటెక్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఆనందదాయకం

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

బయోటెక్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఆనందదాయకమని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. వీజెన్ ల్యాబ్స్ స్టార్టప్‌కు రూ.3.76 కోట్ల ఫండింగ్ రావడంపై ఆయన స్పందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలను ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. హెల్త్‌కేర్, మా ఇంక్యుబేషన్ నుంచి వినూత్న క్యాన్సర్ చికిత్సలకు అవసరమైన మందులను తయారు చేయడానికి వీజెన్ ల్యాబ్స్ కృషి అభినందనీయమన్నారు. ఇన్వెస్టర్లు వినూత్న ఔషధ అభివృద్ధికి ముందుకురావాలన్నారు.